




టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా అమరావతిలో నిర్వహించిన 'సుపరిపాలనకు తొలి ఏడాది' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు జగదీశ్వరి, విజయ్‌చంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి

సాగు భూములకు పట్టాలు ఇవ్వాల్సిందే

- ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నాలు
- వర్షంలోనూ కొనసాగిన ఆందోళనలు
- గిరిజనులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు అరికట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్



కురుపాం తహశీల్దార్ కార్యాలయం వద్ద వర్షంలో ధర్నా చేపడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు, గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి - కురుపాం

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద దళిత, గిరిజనులు ధర్నాలు చేపట్టారు. అందులో భాగంగా కురుపాం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎం.అడ్డమేశ్వరరావు ఆధ్వర్యాన ధర్నా చేశారు. వర్షంలో ఆందోళనను చేపట్టారు. గిరిజనుల ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. పోడు భూములకు 2006 అటవీ హక్కుల చట్ట ప్రకారం 10 ఎకరాల వరకు పట్టాలు ఇవ్వవలసి ఉండగా, 2, 3 ఎకరాలకు అధికారులు పట్టాలిస్తూ చేతులు



పాలకొండలో ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

దులుపుకుంటున్నారని తెలిపారు. ఇది చాలా అన్యాయమన్నారు. ఇప్పటికే ఇచ్చిన పట్టాల్లో అటవీ శాఖ అధికారుల సంతకాలు కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో గిరిజనులు సాగు చేసిన పంటలను అమ్మడానికి సరైన మద్దతు ధర లేక ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అటవీశాఖ అధికారులు తిత్తిరి, దురిబిలి, బాలేసు గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న కొండచీపుర్లు, తదితర అటవీ ఫలసాయాలను అమ్ముకుంటే వారిని అటవీశాఖ అధికారులు డబ్బులు అడగడం దారుణమన్నారు. దండుసుర గ్రామంలో గిరిజనులు ఇటికి కోస్తుంటే మట్టి కోసం కూడా డబ్బులు అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దిమిటిగూడ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయమనే హక్కు అటవీ శాఖ అధికారులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గిరిజనులపై అటవీ శాఖ అధికారుల దౌర్జన్యం మానుకోవాలని, లేకుంటే అటవీ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. తక్షణమే గిరిజనులు సాగు చేస్తున్న భూములకు 10 ఎకరాల వరకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం నుంచి గిరిజన రైతులకు అందాల్సిన రాయితీలన్నీ సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎ.సురేష్ కుమార్ కు వినతి పత్రం అందించారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రెండు నెలల్లో పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని తహశీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చందనపల్లి కృష్ణారావు ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, మండల కన్వీనర్ గవర వెంకటరమణ, భూ సాగుదారులు మిరియాల నాగరాజు, మిరియాల మురళి, తోట లక్ష్మం, సురాపాటి దాసు, ఎస్.అబ్రహం, యమ్మల అమ్మడమ్మ, ఎం.అరుణ, ఎస్.గంగ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ సత్యనారాయణకు వినతి అందించారు. కార్యక్రమంలో వ్యకాస, గిరిజన సంఘం నాయకులు శివున్నాయుడు, హెచ్.రామారావు, కైలాస్ రామస్వామి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, చెంబరు వెంకటరావు, సుబ్బారావు, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, గణేష్, మధు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎంఎన్‌వి ప్రసాద్‌కి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దూసి దుర్గారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు



పాచిపెంటలో వర్షంలో తడుస్తూ నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, గిరిజనులు

మండల కార్యదర్శి కాద రాము, గిరిజన సంఘం నాయకులు ఎస్.మజ్జియ, భానుచందర్, వి.చంప, చిన్నారావు, రామరాజు, లక్ష్మి, జోషియా, సుక్కు , తిరుపతిరావు, సింహాచలం, ఎలియా, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాచిపెంటలో గాంధీ బొమ్మ నుంచి జోరువానలో ర్యాలీ చేపట్టారు. అనంతరం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ రవికి వినతి అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జన్ని రామయ్య, చెల్లూరి జగన్నాథం, కొర్ర కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుర్రు రామారావు, కొర్ర శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ సాయి కామేశ్వరరావుకు వ్యకాస మండల కార్యదర్శి ఎన్.సింహాచలం వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, ఎన్.ప్రసాదరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టంలో ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజలు



వీరఘట్టంలో వినతి అందిస్తున్న నాయకులు



సీతానగరంలో ధర్నా చేస్తున్న నాయకులు, దళితులు



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న జ్వరాలు

రోగులతో ఏరియా ఆస్పత్రి కిటకిట



రోగులతో కిటకిటలాడుతున్న సీతంపేట ఏరియా ఆస్పత్రి

ఏజెన్సీలో ఎపిడిమిక్ సీజన్ ప్రారంభంలోనే వైరల్ జ్వరాలు చాపకింద నీరులా విజృంభిస్తున్నాయి. గత నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం, మరోవైపు అదే స్థాయిలో ఎండలు కాయడం, కొత్తనీరు, కలుషిత జలాలు తాగడం, ఇంకోవైపు అపారిశుధ్యంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేయడంతో ప్రతి ఇంటా ఒకరిద్దరు టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. రోజురోజుకూ సీతంపేట ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. వివిధ రోగాలతో వచ్చిన రోగులతో సోమవారం సీతంపేట ఏరియా ఆస్పత్రి కిటకిటలాడింది. ఆస్పత్రికి సోమవారం 323 ఒపి రాగా, వాటిలో 62 మంది జ్వరాలతో బాధపడుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

- ప్రజాశక్తి, సీతంపేట



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మా బడి మాకు కావాలి

కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో భాగంగా ఎత్తివేసిన పాఠశాలలను కొనసాగించాలని కోరుతూ గరుగుబిల్లి మండలం హిక్కింవలస, బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు ఆధ్వర్యాన పెదపెంకి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధర్నా చేపట్టారు. గరుగుబిల్లి మండలంలోని హిక్కింవలస పాఠశాల విద్యా కమిటీ సభ్యుల ఆధ్వర్యాన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. పాఠశాలలు ఎత్తివేత వల్ల నిరుపేద విద్యార్థులు చదువుకి దూరం అవుతారని, వెంటనే పాఠశాలలు కొనసాగించాలని పిజిఆర్ఎస్‌లో వినతులు అందజేశారు.

విద్యార్థులకు గాయాలు

తమ బడిని కాపాడాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతి అందజేసిన బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన విద్యార్థులు.. ఆటోలో తిరిగి వెళుతుండగా నర్సిపురం వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా వస్తున్న లారీ.. ఆటోను ఢీకొనడంతో విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. సర్పంచ్ నవిరి పాపారావు, సిపిఎం నాయకులు వై.మన్మథరావు, రెడ్డి వేణు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

మూణ్నెల్లు గడిచినా

అందని మెడికల్ రీయింబర్స్‌మెంట్

కమిషనర్ ఎదుట ఆర్ఒ ఆవేదన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మూణ్నెల్లు గడిచినా మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందలేదని, కనీసం ఫైలు కదల్లేదని మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగం ఆర్ఒ డి.రూబెన్.. పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. ఫిబ్రవరిలో తన కుమారుడికి ప్రమాదం సంభవిస్తే, అప్పుచేసి వైద్యం చేయించానని, వైద్య ఖర్చుల బిల్లుల దరఖాస్తులు చేసుకుని 130 రోజులైని ఫైలు కదల్లేదని వాపోయారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పరిపాలన విభాగం గుమస్తాపై చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ స్పందించి సంబంధిత గుమస్తాను పిలిచి తక్షణమే మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఫైల్ తన టేబుల్‌పై ఉంచాలని ఆదేశించారు. ఆర్ఒకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.



ఆర్ఒపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగినులపై వేధింపులు

ఆర్ఒపై కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై రెవెన్యూ అధికారి డి.రూబెన్ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని పలువురు ఉద్యోగినులు సోమవారం సాయంత్రం కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదుచేశారు. తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని, తమ విధులు సక్రమంగా చేసుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్ఒపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోతే విధులను బహిష్కరిస్తామని స్పష్టంచేశారు.

యువతను మోసగించిన ప్రభుత్వం

తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలి ● వైసిపి యువజన విభాగం ఆధ్వర్యాన ర్యాలీ, డిఆర్ఒకు వినతి



ర్యాలీ చేపడుతున్న వైసిపి నాయకులు, యువత

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, ఉద్యోగాలు భర్తీ చేయకుండా టిడిపి కూటమి ప్రభుత్వం యువతను మోసగించిందని వైసిపి యువజన విభాగం నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ విభాగం ఆధ్వర్యాన యువత పోరు కార్యక్రమాన్ని సోమవారం పార్వతీపురం పట్టణంలో చేపట్టారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ హేమలతకు వినతి అందించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్.శరత్‌బాబు మీడియాతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం రూ.3 వేలు నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నాయకులు పల్లా అనంత నాయుడు, కోరాడ శేఖర్, బి.ఎస్.సంతోష్ కుమార్, ఉరిటి అప్పలనాయుడు, దాసరి కిశోర్, రణదేవ్ లక్ష్మణరావు, ముగడ జగన్ మోహన్ రావు, నిమ్మక గోపాల్, షేక్ నిషార్, పొటంగి అచ్యుతరావు, పొట్నూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పరిష్కారం

- డిఆర్ఒ హేమలత
- గ్రీవెన్స్‌కు 203 వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న డిఆర్ఒ హేమలత

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పిజిఆర్ఎస్) వచ్చే దరఖాస్తులకు పారదర్శకంగా పరిష్కారం చూపించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సుధారాణితో కలిసి అర్జీలు స్వీకరించారు. పిజిఆర్ఎస్‌కు 203 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ సమస్యలతో వచ్చే వారి ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు మానవతా కోణంలో ఆలోచించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చని సూచించారు.

ఫిర్యాదుల్లో కొన్ని.....

వీరఘట్టం మండలం యు.వెంకంపేటలో ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, వర్షాకాలంలో భవనం స్లాబ్ తీవ్రంగా లీక్ అవ్వడం వల్ల విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని కొత్త అదనపు భవనాన్ని మంజూరు చేయాలని ఎస్.సింహాచలం అర్జీ అందజేశారు.

గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూసి వేయడం వల్ల విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆ పాఠశాలను పునఃప్రారంభించాలని తాడంగి దమయంతమ్మ, గ్రామస్తులు దరఖాస్తు సమర్పించారు.

బలిజిపేట మండలం పి.చాకరాపల్లి గ్రామానికి చెందిన సిహెచ్. నరసమ్మ కొత్త రేషన్ కార్డు, ఒంటరి మహిళ పింఛను మంజూరు చేయాలని దరఖాస్తు అందించారు.

సర్వేనెంబర్ 85-2లో ఉన్న భూమికి విద్యుత్ కనెక్షన్ పొందడానికి అవసరమైన రుసుం, సర్టిఫికెట్లను విద్యుత్ శాఖకు సమర్పించానని, గుర్తుతెలియని వ్యక్తులు పనిని అడ్డుకుంటున్నారని, వారిపై తగు చర్యలు తీసుకొని, విద్యుత్ కనెక్షన్ పనులను వెంటనే పునరుద్ధరణ చేయాలని పార్వతీపురం మండలం డొంకలకోటపట్నం గ్రామానికి చెందిన డి.లక్ష్మి విన్నవించారు.

గరుగుబిల్లి మండలం వల్లరిగుడబ గ్రామానికి చెందిన అల్లు సింహాచలమమ్మ ఖాతా నెంబర్ 72-2, 75లో ఒక ఎకరం భూమికి ఆధార్ లింక్ చేయాలని అర్జీ అందజేశారు.

మక్కువ మండలం కొయ్యనపేట గ్రామానికి చెందిన గంట రాజు సర్వేనెంబర్ 15లో సుమారు 1.70 ఎకరాల బంజరు భూమిని 20 సంవత్సరాలుగా సాగు చేసుకుని జీవిస్తున్నానని, ఆ భూమికి ప్రభుత్వం సర్వే చేపట్టి, డి-పట్టా మంజూరు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా వీరఘట్టం మండలం అట్టలి గ్రామానికి చెందిన కె.వెంకటనారాయణకు వినికిడి పరికరాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖధికారి బి.రాజ్‌కుమార్, పార్వతీపురం కోఆపరేటివ్ అధికారి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో సీట్ల పంట

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులకు ట్రిపుల్ ఐటి సీట్ల పంట పండింది. సోమవారం సీట్లకు ఎంపికైన విద్యార్థుల పేర్లను ప్రకటించగా పట్టణంలో ఉన్న జ్యోతిరావు పూలే పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గాడివీధి మున్సిపల్ హైస్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను జ్యోతిరావు పూలే పాఠశాల ప్రిన్సిపల్ పెంటయ్య అభినందించారు.

కురుపాం : కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శంకరరావు తెలిపారు. పొన్నాడ ఈశ్వర్ ప్రసాద్, ఎం.రిషిత.. నూజివీడులో, ఎం.శశిశ్రీ శ్రీకాకుళంలో, బొంగు వర్షిని ఒంగోలులో సీట్లు సాధించారని చెప్పారు.

ఎమ్మెల్యే బుచ్చయ్య వ్యాఖ్యలు సరికాదు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి టిడిపి సీనియర్ ఎమ్మెల్యే గోరెంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు సరికాదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఖండించారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తల నరికితే తప్పేమిటని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యానించడం ఆయన సీనియారిటీకి అవమానమేనని చెప్పారు. వైసిపి అధిష్టానం ఆదేశించనందున ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఒకవేళ పార్టీ ఆదేశించి ఉంటే తానే ఫిర్యాదు చేసేవాడినని తెలిపారు. ఇటీవల టిడిపి మండల నాయకుడు తననుద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడానికి పార్టీ న్యాయవాదులతో సంప్రదించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలువురు గిరిజన సర్పంచులు, ఎంపిపిలు ఆ టిడిపి నాయకుడికి ఇచ్చిన డెడ్‌లైన్ గడువు ముగిసిందని, దీనిపై న్యాయపోరాటం చేసే అవకాశాన్ని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని రాజన్నదొర చెప్పారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని బగ్గందొరవలస గ్రామానికి చెందిన ఉపాధి కూలీలతో సోమవారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్‌ను కలిసి, సమస్యను వివరించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ బగ్గందొరవలస గ్రామానికి చెందిన దళిత ఉపాధి కూలీలకు గత మూడు వారాలుగా బిల్లులు చెల్లించలేదని చెప్పారు. మస్తర్లు వెంటనే వేయాలని, ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఎంపిడిఒ వెంటనే స్పందిస్తూ ఎపిఒ బాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌ను పిలిపించి, బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్.కృష్ణ, ఉపాధి కూలీలు నాగరాజు, సూర్యనారాయణ, వెంకటరమణ, అరుణ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన తహశీల్దార్లు

ప్రజాశక్తి-వీరఘట్టం


సాయి కామేశ్వరరావు

వీరఘట్టం తహశీల్దార్‌గా అయ్యంగారి సాయి కామేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొమరాడ తహశీల్దార్‌గా కామేశ్వరరావు విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఉప తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చందక సత్యనారాయణ బదిలీపై కొమరాడ వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ కామేశ్వరరావు మాట్లాడుతూ అందరి సహకారంతో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

కొమరాడ తహశీల్దార్‌గా సత్యనారాయణ


సత్యనారాయణ

కొమరాడ : కొమరాడ మండల తహశీల్దారుగా సిహెచ్ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మండలంలో పనిచేసిన సాయి కామేశ్వరరావుకు వీరఘట్టం తహశీల్దార్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో వీరఘట్టంలో తహశీల్దార్ పనిచేసిన సత్యనారాయణ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనతోపాటు రీ సర్వే డిటి, సివిల్ సప్లై డిటిగా రెడ్డి టకీర్ ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. వీరిని పలువురు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

కురుపాం తహశీల్దార్‌గా జయ


జయ

కురుపాం : కురుపాం తహశీల్దార్‌గా కె.జయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కలెక్టరేట్‌లో పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. ఆమెకు ఉప తహశీల్దార్ ఎ.సురేష్ కుమార్, సిబ్బంది స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జయ మాట్లాడుతూ మండలంలో భూ, రెవెన్యూ సమస్యలు లేకుండా త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు.


పనసభద్ర సచివాలయంలో తనిఖీలు చేస్తున్న ఎంపిడిఒ

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-మక్కువ

మండలంలో పనసభద్ర సచివాలయాన్ని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి సోమవారం సందర్శించారు. ఈ నెల 22న 'ప్రజాశక్తి'లో 'గాడితప్పిన సచివాలయ వ్యవస్థ' కథనం ప్రచురితం కావడంతో ఆమె స్పందించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. అనంతరం నంద పంచాయతీలో జుగా గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 48 సేవలకు సంబంధించి పత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నేడు సీతంపేట మండల సమావేశం

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక వైటిసిలో మంగళవారం ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిబి మిశ్రా తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

27న వీరఘట్టంలో..

వీరఘట్టం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రథయాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి పాలకొండ

ఈ నెల 27 నుంచి జరిగే రథయాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు అన్నారు. జగన్నాథ స్వామి ఆలయ కార్యనిర్వాహక అధికారి సర్వేశ్వరరావు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని కోరారు.

ఇళ్ల బిల్లులు చెల్లించాలని

నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

తోటపల్లి బ్యారేజీ నిర్వాసిత గ్రామాలైన పాతకల్లికోట, దుగ్గిలో నిర్వాసితులు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డిఆర్ఒ కె.హేమలతకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ దుగ్గి, పాతకల్లికోట గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఆర్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లు నిర్మించుకున్నా, ఇంతవరకు వారికి బిల్లులు మంజూరు కాకపోవడం అన్యాయమని మండిపడ్డారు. అందులో మరి కొంతమందికి పాక్షిక బిల్లులు మాత్రమే చెల్లించారని, ఇది చాలా దారుణమని తెలిపారు. గతంలో పలుమార్లు ఇదే సమస్యపై జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నా, నిర్వాసితుల సమస్యల పట్ల అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ప్రస్తుత ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఐదు లక్షల రూపాయలు వరకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిర్వాసిత మహిళలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై 2010 ఆనాటి ప్రభుత్వం ప్రత్యేక జిఒ కూడా విడుదల చేసిందని తెలిపారు. ఇదే జిఒ ప్రకారంగా వంశధార, పోలవరం నిర్వాసిత మహిళలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేస్తున్నారని, తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసిత మహిళలకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే అధికారులు చిత్తశుద్ధితో స్పందించి తోటపల్లి నిర్వాసితుల మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో దుగ్గి, పాతకల్లికోట, తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసిత రైతులు, మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, నిర్వాసితులు

బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో పార్వతీపురం కేంద్రంలో నూతనంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం పిజిఆర్ఎస్‌లో వినతి అందించారు. పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యాన ఉన్న విజయనగరం జిల్లా పరిధిలోని ఆంధ్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని పార్వతీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలకు డెప్యుటేషన్ వేశారని వారు చెప్పారు. డెప్యుటేషన్ వేసి ఆ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్‌గా నియమించారని తెలిసిందన్నారు. విచారణ చేపట్టి ఆ ఉపాధ్యాయుడి అక్రమ డెప్యుటేషన్ రద్దు చేయాలని గిరిజన సంఘాలు నాయకులు పల్ల సురేష్, పాలక రంజిత్ కుమార్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, జట్ల బంగారాజు, కొండగొర్రి చిన్నారావు కోరారు.

25న కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-వీరఘట్టం


వీరఘట్టం.. మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిర

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విఆర్ఎల సమావేశంలో ఆమె మాట్లాడారు. విఆర్ఎ చనిపోతే వారసత్వం కింద కుటుంబానికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ నెల 26న వీరఘట్టంలో జరిగే జీపుజాతాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎన్.సింహాచలం, ప్రసాదరావు, జి.కృష్ణ, వి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద విఆర్ఎల సమస్యలపై ధర్నా చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలతో కలిసి ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా విఆర్ఎల సమస్యలపై పోరాడుతున్నా గత ప్రభుత్వం, కూటమి సర్కారు.. దొందూ దొందేలా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. విఆర్ఎల సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో విఆర్ఎల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే మార్గమని స్పష్టంచేశారు. అందులో భాగంగా ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 62 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట


అర్జీలు స్వీకరిస్తున్న ఎపిఒ చినబాబు

సీతంపేట ఐటిడిఎలో సోమవారం ఎపిఒ జి.చినబాబు ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 62 వినతులు వచ్చాయి. జనగ బుడ్డడుగూడకు చెందిన శేఖర్ గిరి వైద్య మిత్రులకు వేతనం పెంచాలని కోరారు. జన్నోడు గూడకు చెందిన నిమ్మక తులసి ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, ఎఎంఒ కోటిబాబు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరివ్వడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న డిఇ రవికుమార్

ప్రజాశక్తి - కురుపాం

ఖరీఫ్‌లో శివారు భూములకు సాగునీరు అందించడమే లక్ష్యమని నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.రవికుమార్ తెలిపారు. సోమవారం కురుపాంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో నీటి సంఘం అధ్యక్షులు, ఎఇలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో వట్టిగెడ్డ, గుమ్మడి గెడ్డ పరిధిలో కాలువల్లో పూడికలు తీయించి, శివారు భూములకు నీరందిస్తామన్నారు. ఇదే లక్ష్యంతో నీటి సంఘం అధ్యక్షులతో కలిసి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎఇలు రఘు, రవి, శంకర్రావు, నీటి సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

సర్వేయర్ల వినతి

ప్రజాశక్తి-సీతానగరం

గ్రామ రెవెన్యూ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మన్మథరావు, సత్యనారాయణ మాట్లాడుతూ సర్వేయర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 మార్చాలని, భూముల రీసర్వే పెండింగ్ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-సీతానగరం

రోడ్డు భద్రతా నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్ఐ ఎం.రాజేష్ కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, పది మందికి ఉపయోగపడేలా సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు రామారావు, పోలీస్ సిబ్బంది తిరుపతిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి- సీతానగరం

సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు పాఠశాలకు ఎనిమిది కుర్చీలు వితరణ చేశారు. వాటిని సోమవారం ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్న లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ముప్పనేని అనురాధ, పద్మ, సునీత, జె.శ్రీనివాసరావు, ఐ.వి.రమణ, సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి.మాధవి, పి.రామక్రిష్ణ, కొయ్యాన శ్రీరాములు, డి.రామారావు, జి.వి.నాగరాజు పాల్గొన్నారు.

జీపుయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం గ్రామంలో ఈ నెల 26వ తేదీన సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జీపు యాత్రను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీపుయాత్ర కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, మండల నాయకులు ఎన్.సింహాచలం, ప్రసాద్‌రావు, వై.ప్రసాద్, పి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శుల నిరసన

ప్రజాశక్తి-పాలకొండ

సచివాలయ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమోషన్ ఇచ్చిన తర్వాత తమకు బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. పనిభారం ఎక్కువగా ఉందని, వేతనాలు కూడా సరిపడటం లేదని చెప్పారు. కచ్చితమైన జాబ్‌చార్ట్ ఉండాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు షణ్ముఖ, మాధురి, శివ, ప్రసాద్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో డిఎ జుగా

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట పంచాయతీలో పిఎం డిఎ జుగా గ్రామసభను సోమవారం నిర్వహించారు. గిరిజనులు అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిచేందుకు పిఎం డిఎ జుగా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని డిప్యూటీ డిఇఒ జి.రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసభలను గిరిజనులు ఉపయోగించుకుని, వ్యక్తిగత, సామాజిక అవసరాలపై వినతులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, వైస్ ఎంపిపి కె.సరస్వతి, కూటమి నాయకులు బిడ్డికి జయలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు

ప్రజాశక్తి-పార్వతీపురం, సీతంపేట

పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు సంస్థ అడ్మిషన్ ఇన్‌ఛార్జి కె.శివరామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి కేంద్రంగా హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడేళ్ల బిఎస్‌సి (హెచ్ అండ్ హెచ్ఎ) డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40 శాతం ఆపైన మార్కులు పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఫుడ్ అండ్ బేవరేజ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ అండ్ హౌస్ కీపింగ్ విభాగాల్లో నాలుగు నెలల పాటు ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు.

క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి (సిసిఎఫ్‌పిపి) కోర్సుకు పదో తరగతి పాసైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులో ఏడాదిపాటు దేశ విదేశాల వంటకాలు నేర్పించి 6 నెలలు ఫైవ్‌స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తారని వివరించారు. సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ (సిసిఎఫ్‌బిఎస్) కోర్సుకు పదో తరగతి పాసైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి ఒక నెల ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారని తెలిపారు.

కోర్సుల్లో చేరుటకు వయో పరిమితి లేదని, కోర్సులు పూర్తి అయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. కోర్సులో చేరిన వారికి బ్యాంక్ లోన్ సదుపాయం ఉందని, బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం ఉందని వివరించారు. సంస్థలో చేరుటకు దరఖాస్తులు, ఇతర సమాచారం కోసం 9701343846, 9100558006, 9700440604 ఫోన్ నంబర్లను లేదా www.sihmtpt.org వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని వివరించారు.

మున్సిపల్ కార్మికులకు

భోజన, వసతి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా పార్వతీపురం నుంచి పారిశుధ్య పనులకు వెళ్లిన 44 మంది కార్మికులకు భోజన, వసతి బిల్లులు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ.. అధికారులను డిమాండ్‌చేశారు. సోమవారం పార్వతీపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నంలో ఎంతో ఆర్భాటంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారని, కానీ మున్సిపల్ కార్మికులకు కనీస వసతి, భోజన సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.

గతంలో వరదల సందర్భంగా విజయవాడ తరలించిన కార్మికులకు కూడా ఇదే తరహాలో ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు కార్మికుల పట్ల చిత్తశుద్ధితో వారి బాగోగులకు కృషి చేయాలని కోరారు. భోజన, వసతి సౌకర్యం నిమిత్తం కార్మికులు ఖర్చు చేసిన మొత్తం రూ.2 వేలు చొప్పున ఒక్కొక్కరికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ బి సూరిబాబు, మున్సిపల్ కార్మిక నాయకులు గంగరాజు, మామిడి శివ, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


బోల్తా పడిన ట్రాక్టర్

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-మక్కువ


మృతిచెందిన సుబ్బారావు

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం పార్వతీపురం మండలంలోని జిల్లేడువలస సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రసామంతవలస గ్రామానికి చెందిన డ్రైవర్ మండంగి సుబ్బారావు (32) ఆగ్రామంలోని ఇటుక బట్టి నుండి ఒడిశా రాష్ట్రంలోని కేసలీ గ్రామానికి ఇటుకు లోడుతో వెళ్లి, తిరిగి వస్తున్నాడు. జిల్లేడువలస సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో కూలీలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పార్వతీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.